క్లుప్తంగా

'సీజనల్'పై అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ ఆస్పత్రిలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతూ ఉండడంతో ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో గల గుంతల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో మార్పులతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన చెందకుండా వైద్యులను సంప్రదించాలని, ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అంజయ్యగౌడ్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని గౌడ కుల సంఘాల సభ్యులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో గౌడ కులాల సభ్యులతో కలిసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ కులాల అభివృద్ధికి అందరం కృషి చేద్దామని అధ్యక్షుడు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీఓ శైలజ


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌ను ఆమె సందర్శించి కిచెన్, వంట సామగ్రి, కూరగాయలు, వడ్డించిన భోజనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం వడ్డించాలన్నారు. ప్రతీ విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినాలని ఆమె సూచించారు. అంతకుముందు వంట శాలను ఆమె పరిశీలించి విద్యార్థులకు వండుతున్న కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించి, వండిన భోజనాన్ని ఆమె రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పలువురు పాల్గొన్నారు.

పొటాష్.. పంటలకు మేలు

- అన్ని రకాల పంటల్లో తెగుళ్ల నివారణ
- దిగుబడి పెంపునకు దోహదం
- మండల వ్యవసాయాధికారి వెంకటేశం




నాగర్‌గూడలోని ఓ రైతు పంటలో పొటాష్ లోపం

షాబాద్: పొటాష్ అన్ని రకాల పంటలకు మేలు చేస్తోంది. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే చీడపీడల బెడద తగ్గుతుంది. నత్రజని, భాస్వరంతో పాటు పొటాష్ వినియోగంతో నాణ్యమైన పంట చేతికి వస్తుందని వ్యవసాయశాఖ ఏఓ వెంకటేశం సూచిస్తున్నారు. మొక్కను గ్రహించిన నత్రజని, భాస్వరంను పొటాష్‌తో పంటలకు కలిగే ప్రయోజనాలను అధికారి క్లుప్తంగా వివరించారు.

ప్రయోజనాలు ఇలా...

నత్రజని అధికం కావడంతో పంటకు జరిగే నష్టాన్ని నిరోధిస్తుంది. పొటాష్‌తో మొక్కలకు పొడవైన, బలమైన, ఆరోగ్యవంతమైన గుబురు వేర్లు పుడతాయి. భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి వేళ్లు తేమను, పోషకాలను బాగా గ్రహిస్తాయి. గాలులకు వాలిపోవు, వరి కంకుల్లో గింజలు నిండుగా ఏర్పడటానికి తోడ్పడుతుంది. వరి మొక్క బాగా పీచు తేలి దృఢంగా తయారవుతుంది. పోషక పదార్థాలను మొక్కలోని అన్ని భాగాలకు చేరవేయడంలో సహాయపడుతుంది. మొక్కల అభివృద్ధికి కావాల్సిన క్యాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, తుత్తునాగం వంటి ఉప సూక్ష్మపదార్థాలు గ్రహించేందుకు సహాయపడుతుంది. మొక్కలు వేడి, చలి, నీటి ఎద్దడిని తట్టుకొని పరిపుష్టిగా ఉంటాయి.

లోప లక్షణాలు..

మొక్క ప్రారంభ దశలో పొటాష్ లోప లక్షణాలు కనిపించవు. అభివృద్ధి చెందని నల్లని వేర్లు పొటాష్ లోపానికి గుర్తు. ఆకులు ముదురు ఆకుపచ్చగా ఉండి వాటి మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి మొక్క అంతటా వ్యాప్తి చెందుతాయి. ముదిరిన ఆకులు ఎండి రాలిపోతాయి. మొక్కలు సరిగా ఎదగవు. బలహీనంగా పొట్టిగా ఉంటాయి. పొటాష్ లోపంతో చాలా రకాల వేర్లు ఒరిగిపోతాయి. అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు, సుడితెగులు ఉధృతంగా పంటపై ప్రభావం చూపుతాయి.

నివారణ చర్యలు..

భూసార పరీక్షల ఆధారంగా పొటాష్ ఎరువును వినియోగించాలి. సాధారణంగా వరికి ఎకరాకు 18 కిలో పొటాష్ వేస్తే సరిపోతుంది. సిఫారసు చేసిన మోతాదును రెండు సమ భాగాలుగా చేసి చివరి దమ్ములో, సిరుపొట్ట దశలో వేయాలి. పొటాష్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయడంతో అధిక ప్రయోజనం ఉంటుంది. జింకు లోపం ఉన్న భూముల్లో పొటాష్ మొత్తం యూరియాతో పాటు దమ్ములోనే వేయాలి. వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల్లో పొటాష్ బాగా పనిచేస్తుంది.

ఎమ్మెల్యేకు సన్మానం


నందిగామ: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రజాపద్దుల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, కొమ్ము కృష్ణ, రాజు, శివశంకర్‌గౌడ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: ప్రజాపద్దుల సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జంగ నర్సింహ, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పద్దుల కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయడం చాలా గొప్పవిషయమన్నారు. ఎమ్మెల్యేపై సీఎంకు అపారమైన నమ్మకం ఉందన్నారు. అనంతరం గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కొమ్ము కృష్ణ, నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజగోపాల్, మాజీ సర్పంచ్‌లు రమేశ్‌గౌడ్, రాజునాయక్, నాయకులు చిందం నర్సింహ, నవాజ్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, సుక్యానాయక్, తుమ్మల నర్సింహయాదవ్, బాల్‌రెడ్డి, దార లింగం, శ్రీకాంత్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, మంకాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

13న మండలస్థాయి క్రీడాపోటీలు

కొందుర్గు: మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ స్వాములు, బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలు అండర్ 14, అండర్ 17 విభాగాలుగా చేసి నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 13వ తేదీ ఉదయం 8 గంటలకు కొందుర్గు ఉన్నత పాఠశాలకు రావాలని సూచించారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: మహిళల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చిన మహిళలందరికీ కావాల్సిన మందులను అందజేయాలని సూచించారు. అదేవిధంగా బీపీ, షుగర్ ఉన్నవారిని గుర్తించాలన్నారు. వైద్యాధికారుల సూచనల మేరకు అవసరమైన మహిళల నుంచి రక్తనమూనాలు సేకరించి కొండాపూర్‌లో ఉన్న టీహబ్‌కు పంపించాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత ఉంటే వెంటనే జిల్లా ఫార్మసీకి ఇండెంట్ పంపించి మందులను తెప్పించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులు రాకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడిపదార్థాలను తినాలని సూచించారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వ్యాధులు దోమల నుంచి వస్తాయని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 65 మంది మహిళలను పరీక్షించినట్లు తెలిపారు. అందులో 14 మంది నుంచి రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది సంధ్య, ప్రవీణ, ఉదయ్‌కుమార్, శివ, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

మండల ప్రత్యేకాధికారి రాజారత్నం


హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారి రాజారత్నం

కేశంపేట: హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ రాజారత్నం సూచించారు. మంగళవారం కేశంపేట మండలం కొత్తపేటలో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. హాస్టల్ పరిసరాలతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని సూచించారు. మంచినీటి నల్లాల వద్ద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలోఎంపీఓ కిష్టయ్య, పంచాయితీ కార్యదర్శి తదిరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి పూజలు


మొయినాబాద్: సురంగల్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న యువకులు

మొయినాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు ఘనంగా పూజలందుకుంటున్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో శివాజీ మహారాజ్ యూత్ వినాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మంగళవారం యువకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం యువకులు శ్రీనివాస్ చారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

షాద్‌నగర్: పట్టణంలోని అయ్యప్ప కాలనీలో లారీ సంఘం వారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహారాజా దాబా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని విశ్వం ప్రారంభించారు.

నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథులను భక్తులు నిమజ్జనానికి తరలించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, బాకారం, ఎన్కెపల్లి, ముర్తుజాగూడ, కనకమామిడి తదితర గ్రామాల్లో భక్తులు తమ ఇళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు మంగళవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి సమీపంలోని వాగులు వంకలు, కుంటలు, చెరువుల్లో నిమజ్జనానికి తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్రతో గ్రామాల్లో సందడిగా నెలకొంది. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో మండల విశ్వకర్మ అధ్యక్షుడు నర్సింహచారి కుటుంబ సభ్యులతో కలిసి గణనాథులను ఈసీ వాగులో నిమజ్జనం చేశారు.


మొయినాబాద్‌రూరల్:అమ్డాపూర్‌లో గణనాథులను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు


షాద్‌నగర్: అన్నదాన కార్యక్రమంలో స్థానికులు

డీజేలు వాడితే కఠిన చర్యలు

సీఐ పవన్‌కుమార్‌రెడ్డి


పూజలో పాల్గొన్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గణనాథుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు నిమజ్జనాల సమయంలో డీజేలు ఏర్పాటు చేస్తే యజమానులపై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తప్పవని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆయన వివిధ గ్రామాలను పర్యటిస్తూ నక్కలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీఐని, ఏఎస్సై శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జన ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. డీజేలకు దూరంగా ఉంటూ భజన భక్తితో గణేశ్ నిమజ్జనాన్ని నిర్వహించాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో అంజయ్యగౌడ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చిలుకూరు గ్రామ అధ్యక్షుడు రాజీనామా

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గున్నాల సుధాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని, అందుకే తాను పార్టీ పదవికి రాజీనామా చేసి సామాన్య కార్యకర్తగా కొనసాగుతానన్నారు. తనతోపాటు తన అనుచరులు సైతం పార్టీ పదవులకు రాజీనామా చేసి సామాన్య కార్యకర్తలుగానే కొనసాగుతారన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డెం ఝాన్సీ


మాట్లాడుతున్న ఝాన్సీ

చేవెళ్ల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డెం ఝాన్సీ అన్నారు. చేవెళ్లలోని మోడల్ స్కూల్, బాలికల ఉన్నత పాఠశాల, చనువెళ్లి పాఠశాల, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటిపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలకు యువత క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అలాంటి ధోరణి మంచిది కాదన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటేనే మంచి జ్ఞానంతో వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటారని చెప్పారు. పేదలు ధనికులుగా మారాలంటే వారికి ఉన్న ఆయుధం విద్య ఒక్కటేనని గుర్తుంచుకోవాలన్నారు. విద్య ఉంటనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. కుల, మత, వర్గ భేదాలను వీడాలన్నారు. సమాజానికి, కుటుంబానికి మంచిపేరు తీసుకొచ్చే పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి జిల్లా కో–ఆర్డినేటర్లు, సైకాలజిస్ట్ లక్ష్మి, గ్రామ నాయకులు నర్సింలు, విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక మండపం

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో వినాయకచవితి ఉత్సవాలను ప్రజలు నిత్యం అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను ఆ విఘ్నేశ్వరుడికి సమర్పించి తమకు ఎలాంటి విఘ్నాలు రాకుండా, విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని వేడుకున్నారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 180, మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో 124 విగ్రహాలకు నిర్వాహకులు అనుమతి పొందారని పోలీసులు తెలిపారు. మండలంలోని మహాలింగాపురం గ్రామంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ యూత్ ఆధ్వర్యంలో రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన టెంపుల్ సెట్ చూసేందుకు చుట్టూ పక్కన గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్తున్నారు.


మహాలింగాపురంలో టెంపుల్ సెట్ వినాయక మండపం

పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ


ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు


చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు


మొయినాబాద్‌లో..


షాబాద్‌లో..

షాద్‌నగర్: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెలువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు విఠ్యాల పెంటయ్య, నందిగామ రాంచందర్, అశోక్, నందిగామ శేఖర్, చించోడ్ అనంతం, జంగం మల్లేశ్, ఆంజనేయులు, మాణిక్యం, నర్సింలు, శివ, బాల్‌రాజ్, రామస్వామి, సున్నం రాజు, కిట్టు, యాదయ్య, శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలి

షాబాద్: ప్రతి ఒక్క మహిళ చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, రజక సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు తమ్మలి రవీందర్, ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింలు, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మాజీ ఎంపీటీసీ అశోక్ తదితరులు ఉన్నారు.

వీరవనిత చాకలి ఐలమ్మ

చేవెళ్ల: తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ అని ఆమె పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మలో పాల్గొన్న ఆయన చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

ఆశయాలను సాధిద్దాం

మొయినాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్, మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పెండ్యాల శ్రీనివాస్, యాదయ్య, గౌడ కుల హక్కుల సమితి అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పానగారి యాదగిరి, భాస్కర్, చాకలి శ్రీనివాస్, నవీన్, మహేందర్ తదితరులు ఉన్నారు.

కొందుర్గు: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో అందరం నడవాలని కొందుర్గు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ చేవెళ్ల కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.